ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 34.5
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

శుక్రవారం 16 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590.00 (312.5050)	67,753	63,129
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.30 (3.77)	1009.48	512.82
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.40 (39.66)	39,669	2,400

చికెన్ ధరలు	లైవ్ : రూ.110	డ్రెస్ : రూ.150	స్కిన్‌లెస్ : రూ.180

మహనీయుల అడుగుజాడల్లో

అంతా నడవాలి



జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించి మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



- జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి
- ఎందరో త్యాగాల ఫలితమే దేశానికి స్వాతంత్ర్యం
- దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ
- సీఎం నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన
- మహనీయుల చరిత్రలు నేటి తరానికి ఆదర్శం
- అవినీతి రహితపాలన అందించేందుకు ప్రయత్నం
- రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలబెడతా
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పేటలో అంబరాన్నంటిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు



సూర్యాపేట(కలెక్టరేట్) ఆగస్టు 15: మహనీయుల చరిత్రలు నేటి తరానికి ఆదర్శమని, వారి స్ఫూర్తితో, వారి అడుగుజాడల్లో నడుస్తూ బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం పాలనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించిన నాటి నాయకులు స్వాతంత్ర్యం కోసం వారి జీవితాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అలాంటి మహనుభావుల త్యాగాలకు నివాళులర్పించడం ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ, ప్రజాపాలన

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ, ప్రజాపాలన కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ అన్నారు. జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అవినీతిరహిత పాలన అందించేందుకు ప్రయత్నించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడ ఏమూలన సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకరావాలన్నారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి అమలు చేశామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, ఇతరులు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని, అందులో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 1,29,36,000 మంది ఉచితంగా ప్రయాణించారని, అందుకుగాను రూ.66.86కోట్లను ప్రజలు లబ్ధిపొందారని చెప్పారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, దీంతో జిల్లాలో 19,096 మంది పేదలు వివిధ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందారని తెలిపారు. పేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇళ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లను నిర్మిస్తామన్నారు. హుజూర్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలో రామస్వామి గుట్టవద్ద 2,160 ఇళ్ల నిర్మాణంకోసం రూ.74.80కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 560 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి ఆభారాన్ని కొంత మేరకైనా తగ్గించాలనే ఉద్దేశ్యంతో రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందించేందుకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టం చేశారు. ఈపథకం ద్వార జిల్లాలో 1.48 లక్షల మంది లబ్ధి పొందుతుండగా ఇప్పటివరకు 2.37 లక్షల సిలిండర్లను సబ్సిడీపై అందించామన్నారు. దీనికిగాను ప్రభుత్వం రూ.7కోట్ల సబ్సిడీని ఆయా గ్యాస్ కంపెనీలకు అందించిందన్నారు. రుణమాఫీ విషయంలో జిల్లాలో 82,593 మంది రైతులు రుణమాఫీ పొందినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఎత్తిపోతల పథకంకోసం రూ.519కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. మూసీ కాల్వల ఆధునికీకరణకు రూ.88.76కోట్లు మంజూరయ్యాయని, అందులో భాగంగా ఇప్పటివరకు రూ.56.17కోట్ల పనులు జరిగాయని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షించడంలో జిల్లా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఏదైనా సంఘటన జరిగితే, ఆ ప్రదేశానికి సమాచారం అందిన 10 నిముషాల్లో చేరుకొని బాధితులకు భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లకు 8,067 ఫిర్యాదులు రావడంతో సంబంధిత పోలీస్ అధికారులు వాటికి తగిన చర్యలు తీసుకున్నారన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న నిషేధిత గంజాయిని అరికట్టడంలో పోలీసుల కృషి మరువలేనిదన్నారు. అందుకోసం ప్రతీ రోజు విద్యాసంస్థల్లో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా అంతరాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి అక్రమ రవాణాను అరికడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు గంజాయి రవాణా చేస్తున్న 87 మందిని పట్టుకొని వారి నుంచి 26కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు వివరించారు. అంతర్జాతీయ టెర్రరిస్టులను మట్టుబెట్టిన చరిత్ర కూడా సూర్యాపేట జిల్లా పోలీసులకు ఉందన్నారు. మహిళల రక్షణకోసం ఆరు షీటీమ్ బృందాలు పని చేస్తూ 310 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళలకు భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠపర్చేందుకు రాగద్వేషాలకు అతీతంగా జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. వినూత్న ఆలోచనలతో జిల్లాను అభివృద్ధి బాటలో పయనింపజేస్తున్న జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రత్యేక హెలీకాప్టర్‌లో వచ్చిన మంత్రి

జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు హాజరయ్యేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో సూర్యాపేటకు చేరుకున్నారు. సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీకళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు హెలీకాప్టర్ చేరుకుంది. అక్కడినుంచి కాన్వాయ్ ద్వారా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసుల గౌరవ వందనం స్వీకరణ, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, వేడుకలనుద్దేశించి ప్రసంగం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ప్రభుత్వశాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్యక్రమం ముగియక ముందే వెళ్లిపోయారు. సూర్యాపేట నుంచి హెలీకాప్టర్‌లో మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెళ్లారు. మిగిలిన కార్యక్రమాలను కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ కొనసాగించారు.



సమరయోధులకు ఆత్మీయ పలకరింపు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



జాతీయ గీతాలాపన చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 15: జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పోలీస్ వందనం స్వీకరించి అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహనీయుల చరిత్ర, వారి సేవలు ఎప్పటికీ మరువకూడదన్నారు. నేటి యువతకు మహనీయుల చరిత్రపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ అందచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు మేక నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీ జి.రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- మంత్రులను కలిసిన కాంగ్రెస్ నేతలు



సూర్యాపేటలో మంత్రులతో స్థానిక కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 15: కార్యకర్తలు కష్టపడి పనిచేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన మంత్రులను స్థానిక కాంగ్రెస్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు వారికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పబ్లిక్‌క్లబ్ సెక్రెటరీ కొప్పుల వేణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, చకిలం రాజేశ్వర్‌రావు, అనురాధ, భాస్కర్ పాల్గొన్నారు.

చి'వరి'కి దిక్కేదీ?

- ప్రశ్నార్థకంగా లింగగిరి మేజర్ ఆయకట్టు
- ఆందోళన బాట పట్టిన రైతులు



పిచ్చి మొక్కలతో నిండి లింగగిరి మేజర్ కాల్వ




ధ్వంసమైన పైప్‌లైన్లు

హుజూర్‌నగర్, ఆగస్టు 15: నాగార్జునసాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరు అందకపోవడంతో రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. సాగునీటి కోసం రైతులు ఆందోళనబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.184కోట్లు మంజూరైన పనులు ప్రారంభం కాకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదలచేసి 10 రోజులు కావస్తున్నా ఎడమకాల్వ పరిధిలోని మొదటిజోన్‌లో చుక్క నీరు రావడంలేదు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న లింగగిరి మేజర్ చివరి భూములకు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఎంబీ కెనాల్ తూము నుంచి సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర లింగగిరి మేజర్ విస్తరించి ఉంది. దీనికింద సుమారు 10వేల ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది. ఎంబీ కెనాల్ నుంచి హుజూర్‌నగర్ టౌన్ పరిధిలో సుమారు మూడు కిలోమీటర్ల మేర లింగగిరి మేజర్ ఉంది. కాగా ఈ మేజర్ ఆధునికీకరణ పనులకోసం ప్రభుత్వం గత రెండేళ్ల క్రితం సుమారు రూ.12కోట్లకు పైనే మంజూరు చేశారు. కానీ కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకుని నేటికీ పనులు ప్రారంభించలేదు. ఈ ఆయకట్టు పరిధిలో హుజూర్‌నగర్, లింగగిరి, కావవారిగూడెం, లక్కవరం ప్రాంతాల పరిధిలోని రైతుల ఆయకట్టు స్థిరీకరించారు. వేల ఎకరాల ఆయకట్టుకు సంబంధించి పనులు చేయాల్సి ఉన్నా ఒక్క రూపాయి పనులు కూడా చేయలేదు. ముఖ్యంగా లింగగిరి మేజర్‌కు సంబంధించి కోదాడ రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి సీతారాంనగర్, దీక్షిత్‌నగర్, చింతలబజార్, ఎన్టీఆర్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ వరకు టౌన్ పరిధిలో కాల్వ ఉంది. కాగా చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన రైతులకు అనేక మైనర్ల ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉంది. కాగా కాల్వలన్నీ చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ముఖ్యంగా కాల్వల్లో కంపచెట్లు పెరిగిపోయి నీటి ప్రవాహం నిలిచిపోతుంది.

మేజర్ కాల్వలో మట్టి.. తగ్గిన నీటి ప్రవాహం

ఇటీవల పట్టణంలో ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సమయంలో కాల్వకట్టపై ఉన్న ఇళ్లను కూలగొట్టారు. ఆ మట్టి మొత్తం లింగగిరి మేజర్‌లో పడిపోయింది. మునిసిపల్ అధికారులు ఆ మట్టిని తొలగించకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర నీటి ప్రవాహం నామమాత్రంగా సాగుతుంది. సుమారు 200 ఇళ్ల మట్టి, సిమెంట్ ఇటుకలు కాల్వలో పడిపోయాయి. ఇక ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు అడ్డంకిగా మారాయి. లింగగిరి మేజర్ పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ కాల్వ కట్టపై సుమారు ఐదు కిలోమీటర్ల మేరకు ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మిస్తున్నారు. ఒకవైపు ఆధునీకరణ పనులు చేపట్టపోవడం, మరోవైపు కూలగొట్టిన ఇళ్ల మట్టి కాల్వలో పడిపోవడం, పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే చెత్తాచెదారంతో కాల్వ నీళ్లు దిగువకు పోవడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. లింగగిరి మేజర్‌కు పూర్తిస్థాయి డిజైన్ ప్రకారం వంద క్యూసెక్కుల నీరు విడుదల చేసినా సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన నీరు ఐదారు కిలోమీటర్ల దూరం కూడా వెళ్లడంలేదు. సాగర్ నీరు వృథాగా పోతున్నా ఆయకట్టు చివరి భూములకు మాత్రం నీరు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా కాల్వకు తాత్కాలికంగా మరమ్మతులుచేసి చివరి ఆయకట్టుకు నీరు అందించాలని కోరుతూ రైతులు, రైతుసంఘాలతో కలిసి ఆందోళన చేపట్టారు. రెండేళ్లుగా ఎడమకాల్వకు నీరు రాకపోగా, కనీసం ఈ ఖరీఫ్‌కు అయినా నీరు వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అధికారులు ఇప్పటికైనా స్పందించి కాల్వల్లో ఉన్న చెత్తాచెదారం జేసీబీలతో తొలగించి చివరి ఆయకట్టుకు నీరు అందించాలని రైతాంగం కోరుతోంది.


చివరి భూములకు నీరు అందించాలి



ఆయకట్టు చివరి భూములకు సాగునీరందించాలి. లింగగిరి మేజర్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. 10 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఆయకట్టులో కనీసం నాలుగు కిలోమీటర్ల మేర కూడా నీరు రావడంలేదు. వేల ఎకరాల ఆయకట్టు ఎడారిగా మారింది. ఆధునీకరణ పనులు చేపట్టకపోవడం బాధాకరం. సాగర్‌లో నీరు ఉన్నా చివరి ఆయకట్టుకు నీరు రాకపోవడం రైతులకు అన్యాయం చేయడమే అవుతుంది.

పల్లె వెంకటరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

నీరందించేందుకు కృషి చేస్తాం



ఆయకట్టు చివరి భూములకు నీరు అందించేందుకు కృషి చేస్తాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. కాల్వల్లో ఉన్న చెత్తను తొలగిస్తాం. రైతులందరూ ఒకేసారి నాటు పెట్టడం వల్ల చివరికి నీళ్ల రావడం లేదు. త్వరలోనే సమస్యను అధిగమిస్తాం.

తుమ్మల శ్రీనివాస్, ఏఈ

హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌ది

- ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 15: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీది అని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దిగుమతి యూనియన్ హమాలీ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. అనంతరం కౌన్సిలర్ నామా అరుణ, కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం

సూర్యాపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీ రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని యర్కారం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ సీనియర్ నేత వడ్డే యల్లయ్య జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పాఠశాలల బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు పనిచేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతు భాస్కర్, కోతి గోపాల్‌రెడ్డి, కుంటిగొర్ల శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న ఎంపీ రఘువీర్

గుట్టపై కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ప్రధానాలయంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 15: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం అర్చకస్వాములు ప్రత్యేక హోమ కార్యక్రమాలు నిర్వహించారు. గడిచిన ఏడాది కాలంలో తెలిసీతెలియక చేసే తప్పుల నివారణకు ఏటా పవిత్రోత్సవాలు చేపట్టడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం నవకలశ స్నపనం, యాగశాలలో ద్వార తోరణ పూజ, కుంభారాధన చేపట్టిన అర్చకస్వాములు ప్రత్యేక హోమ కార్యక్రమాలు నిర్వహించారు. లఘు పూర్ణాహుతి, గర్భాలయంలో మూలవరులకు లఘు పవిత్రధారణ చేపట్టిన అనంతరం మహా నివేదన తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం సుదర్శ చక్రారాధన, ఆవాహనం చేసి, అభిషేకించి ఏటా ఒక రోజు వేసే పూలమాల వేశారు. వేద మంత్రోచ్చరణల నడుమ మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా, అర్చకస్వాములు పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేటి ఉత్సవాలు

శుక్రవారం జరిగే పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం మహాపూర్ణాహుతి, స్వామిఅమ్మవార్లకు, ఆళ్వార్లకు, అర్చకస్వాములకు పవిత్రధారణతో పవిత్రోత్సవం పరిసమాప్తి అవుతాయని వేదపండితులు తెలిపారు.

యాదగిరికొండపై భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో గురువారం యాదగిరికొండపై రద్దీ నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవం సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 20వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల వద్ద భక్తుల రద్దీ ఉండగా, ఆలయ ఉత్తర దిశలో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటుచేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,10,361 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా స్వామివారిని తెలంగాణ టూరిజం ఎండీ డాక్టర్ కే లక్ష్మి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద కుటుంబసభ్యులతో వేర్వేరుగా దర్శించున్నారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం చేసి ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు.

సీఎం నుంచి మెడల్స్ అందుకున్న పోలీసులు



సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మెడల్స్ అందుకుంటున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాస్

కోదాడ / చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 15 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన పోలీసులు సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మెడల్స్ అందుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ కాట్రగడ్డ శ్రీనివాస్‌లు ఇండియన్ పోలీస్‌మెడల్‌ను అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం వీరికి మెడల్స్‌ను అందజేశారు. వీరికి సీనియర్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఎర్రకోట వద్ద వేడుకల్లో కోదాడ విద్యార్థిని



ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న విద్యార్థిని నిరంజన

కోదాడ రూరల్, ఆగస్టు 15 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా భారత రక్షణశాఖ బాలలకు వివిధ పోటీలను నిర్వహించింది. అత్యుత్తమంగా నిలిచిన 250మంది చిన్నారులను న్యూఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానించింది. ప్రధాని నరేంద్రమోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే ఈ కార్యక్రమంలో చిన్నారులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించారు. అందులో భాగంగా కోదాడ తేజ విద్యాలయానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని నిరంజన స్వాతంత్ర్య పోరాటయోధుల ఫ్యాన్సీ డ్రెస్ ఫొటో కాంటెస్టులో ఎంపికై రక్షణ శాఖ ఆహ్వానంతో వేడుకల్లో పాల్గొన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం విలేకరులకు తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన మద్యం పట్టివేత

వలిగొండ, ఆగస్టు 15 : నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన మద్యాన్ని గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన భీమగాని రంగయ్య కిరాణా దుకాణం నడుపుతున్నాడు. అందులో వివిధ రకాలకు చెందిన 40 బాటిళ్లను నిల్వచేసినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సదరు మద్యాన్ని స్వాధీనం చేసుకొని దుకాణ యజమాని రంగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భువనగిరిలో చైన్ స్నాచింగ్



సంఘటనా స్థలంలో విచారణ జరుపుతున్న పోలీసులు

భువనగిరి టౌన్, ఆగస్టు 15 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో గురువారం రాత్రి చైన్‌స్నాచింగ్ జరిగింది. స్థానిక ఆర్‌బీ నగర్‌కు చెందిన సిరికొండ భాగ్యలక్ష్మి తన స్నేహితురాలితో కలిసి పనినిమిత్తం వెళ్తుంది. కిసాన్‌నగర్‌లో ఎదురుగా రెండు బైక్‌లపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోంచి రూ.3.50లక్షల విలువైన ఐదు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయారు. అయితే ఆ సమయంలో వీధిదీపాలు వెలగకపోతుండడంతో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉంది. గొలుసు అపహరించిన వ్యక్తుల బైక్‌ల వెనుక వారిద్దరూ అరుస్తూ పరిగెత్తినా ఫలితం దక్కలేదు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ మల్లయ్య సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీలను సేకరిస్తున్నారు.

నకిరేకల్ మునిసిపల్ తాత్కాలిక చైర్మన్‌గా ఉమారాణి



తాత్కాలిక చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపడుతున్న ఉమారాణి

నకిరేకల్, ఆగస్టు 15 : నల్లగొండ జిల్లా నకిరేకల్ మునిసిపాలిటీ తాత్కాలిక చైర్‌పర్సన్‌గా ప్రస్తుత వైస్‌చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా ఉన్న రాచకొండ శ్రీనివాస్‌గౌడ్‌పై ఈ నెల 12వ తేదీన అవిశ్వాసం నెగ్గడంతో ఆయన పదవిని కోల్పోయాడు. దీంతో వైస్‌చైర్మన్ మురారిశెట్టి ఉమారాణిని తాత్కాలిక చైర్‌పర్సన్‌గా నియమిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల జారీ చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో గురువారం ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పంటకాల్వలకు నీళ్లు

- ఫలించిన రైతుల శ్రమదానం
- ముమ్మరం కానున్న వరినాట్లు

నిడమనూరు, ఆగస్టు 15 : రైతుల శ్రమ ఎట్టకేలకు ఫలించింది. పంట కాల్వలకు సజావుగా సాగు నీరు వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు పనులను ముమ్మరం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఎల్ 4-5 ఎత్తిపోతల పథకం కింద పంట కాల్వలకు ఈ నెల 13 నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు కింద వరినాట్లు ముమ్మరం కానున్నాయి. రెండేళ్లుగా సాగర్ కాల్వలకు నీటి విడుదల లేకపోవడంతో ఎత్తిపోతల పథకాల కింద భూములు కూడా సాగుకు నోచుకోలేదు. ఈ ఏడాది ఎగువ నుంచి వచ్చిన భారీ వరదలతో నాగార్జునసాగర్ జలాశయంలో సమృద్ధిగా నీరు చేరడంతో కాల్వలకు నీటిని విడుదల చేశారు. కానీ ఎత్తిపోతల పథకాల కింద పంటకాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో పాటు కంపచెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. దీనికితోడు అనేకచోట్ల గండ్లు, బుంగలు పడటంతో పంట కాల్వల ద్వారా ముప్పారం భూములకు సక్రమంగా సాగునీరు చేరే అవకాశం లేదు.



పూడిక తొలగించిన కాల్వ ద్వారా పొలాలకు వెళ్తున్న నీరు

దీంతో గ్రామానికి చెందిన పలువురు రైతులు తెలకపల్లి శంకర్ ఆధ్వర్యంలో శ్రమదానానికి ముందుకొచ్చారు. సొంత ఖర్చులతో కాల్వల్లో పెరిగిన కంపచెట్లు, పూడికను జేసీబీతో యుద్ధప్రాతిపదికన తొలగించుకున్నారు. అంతేగాకుండా గండ్లు, బుంగలు పడిన చోట్ల పొలాలకు సాగునీరు సక్రమంగా పారేందుకు పటిష్టంగా నీనీ ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు కూడా రైతులకు కావాల్సిన కొంతమేరకు సామాగ్రిని అందించారు. దీంతో దెబ్బతిన్న పంటకాల్వలు రైతుల శ్రమతో ఎట్టకేలకు మెరుగయ్యాయి. మంగళవారం నుంచి కాల్వలకు నీటిని వదలడంతో కాల్వల్లో నీటి ప్రవాహం కనిపిస్తోంది. రెండేళ్ల తర్వాత తమ భూములకు నీళ్లు అందుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాల్వల ద్వారా సజావుగా సాగు నీరు వస్తుండటంతో లిఫ్టు కింద సేద్యం ముమ్మరం కానుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. కాగా ఈ ఎత్తిపోతల పథకం కింద నిడమనూరు, త్రిపురారం మండలాల్లోని మూడు గ్రామాల్లో 1,850 ఎకరాలు సాగులోకి రానున్నాయి.



పంటకాల్వలకు నీటిని విడుదల చేసిన దృశ్యం

రెండు గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, కేతేపల్లి, ఆగస్టు 15: నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఉంది. ఎగువన శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 67,753 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో సాగర్ నీటి మట్టం ప్రస్తుతం 590 అడుగులుగా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని రెండు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 63,129 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 67,753 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది.

గరిష్ఠానికి చేరువలో 'పులిచింతల'

మేళ్లచెర్వు : ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు గరిష్ఠ మట్టానికి చేరువలో ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77) టీఎంసీలు కాగా గురువారం సాయంత్రానికి 173.91(40.47టీఎంసీ)అడుగులకు చేరువైంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 56,603 క్యూసెక్కులు కాగా తెలంగాణ జలవిద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు అన్నిగేట్లు మూసివేయగా అవుట్ ఫ్లో 16వేలు క్యూసెక్కులు నమోదైంది.

డిండి ప్రాజెక్టు ఆయకట్టుకు 20 రోజులవరకే నీరు

డిండి: నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టు ఆయకట్టుకు 20 రోజులవరకు మాత్రమే సరిపడా నీరు నిల్వఉన్నట్లు అధికారులు గురువారం తెలిపారు. జూన్ 28 నుంచి వానాకాలం సీజన్ సాగు కోసం విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ గరిష్టనీటిమట్టం 36(2.4టీఎంసీలు)అడుగులు కాగా నీటి విడుదలచేసే సమయంలో రిజర్వాయర్‌లో 26(1.2 టీఎంసీలు)అడుగులమేర నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో నీటి ఆధారంగా సుమారు 12వేల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. మరో 10శాతం వరినాట్లు టెయిల్‌ఎండ్‌లో మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 16 (0.4టీఎంసీలు) అడుగులు నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలలో పెట్టుబడులుపెట్టిన రైతులు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండి రిజర్వాయర్ నింపి ఈ సీజన్‌లో పంట పొలాలను కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

'మూసీ'కి నిలకడగా ఇన్‌ఫ్లో

నల్లగొండ జిల్లా కేతేపల్లిలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి 1009.48 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులు కాగా, ప్రస్తుతం 642.30 అడుగులుగా నమోదైంది. 4.46టీఎంసీల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టులో 3.77టీఎంసీల నీరు నిల్వ ఉంది. మూసీ కుడి, ఎమడ కాల్వలకు 256.41 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

పర్యాటకులు పోలీసుల సూచనలు పాటించాలి: సీఐ



సీఐ విడుదల చేసిన రూట్ మ్యాప్

నాగార్జునసాగర్ : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌కు నిత్యం పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిండి క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో పర్యాటకుల తాకిడి మరింత పెరిగింది. దీనికి తోడు వరుస సెలవులతో రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రాజెక్టు సందర్శనకు పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో సాగర్‌కు వచ్చే మార్గంలో మలుపులు ఎక్కువగా ఉండటంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే కాకుండా ట్రాఫిక్ జాం సమస్య ఏర్పడుతోంది. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు సూచనలు పాటించాలని సీఐ బీసన్న అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.

- పోలీసులు సూచించిన ప్రదేశంలోనే వాహనాలను నిలపాలి
- సాగర్ ప్రధాన రహదారి మొత్తం ఘాట్ రోడ్డు ఉంది. కాబట్టి ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేయవద్దు
- కృష్ణానదిలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున నదిలోకి పర్యాటకులు వెళ్లొద్దు.
- పర్యాటకులు సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలను గురించి పర్యాటక శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకోవాలి.

పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాలు

- ప్రధాన రహదారి కొత్త వంతెన నుంచి టీఎస్‌జెన్‌కో ప్రధాన జల విద్యుత్ కేంద్రం దారిలో శివాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా..
- జెన్‌కో అతిథిగృహం నుంచి డీపీవీ పాఠశాల మీదుగా టైగర్ వ్యాలీకాలనీలో 420 గ్యాలరీ లైన్ వరకు..
- డీపీవీ పాఠశాల మైదానంలో
- జెన్‌కో ఎస్‌బీటీ ఏటీఎం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ ప్రదేశాల్లోనే పర్యాటకులు తమ వాహనాలను పార్కింగ్ చేయాలని సీఐ కోరారు.

వల కాళ్లకు చిక్కి యువకుడి మృతి



శ్రీనివాస్ మృతదేహం

కేతేపల్లి, ఆగస్టు 15 : చేపల వేటకు వెళ్లిన యువకుడు వలలో చిక్కుకుని మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం బొప్పారం గ్రామ శివారులోని మూసీ ప్రాజెక్టు కుడి కాల్వ తూము వద్ద గురువారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ శివతేజ తెలిపిన మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన బైరబోయిన శ్రీనివాస్(30) అదే గ్రామానికి చెందిన కిరణ్, వెంకన్న, రాంమూర్తిలతో కలిసి మూసీ ప్రాజెక్టులో చేపల వేటకు విసురుడు వలలతో వచ్చారు. ప్రాజెక్టు కుడి కాల్వకు నీటి విడుదల కొనసాగుతుండడంతో అక్కడే వలలు విసురుతూ చేపలు పడుతున్నారు. నీటి ఉధృతి అధికంగా ఉండడంతో వల విసిరే క్రమంలో అదుపుతప్పి కాల్వ నీటిలో పడిపోయిన శ్రీనివాస్ కాళ్లకు వల చుట్టుకోవడంతో కదలలేని స్థితిలో నీటిలో మునిగిపోయాడు. ఇది చూసిన తోటి వారు కేకలు వేయడంతో పరిసరాల్లోని వారు అక్కడకు చేరే సరికే శ్రీనివాస్ పూర్తిగా నీటిలో మునిగిపోయాడు. దీంతో వారు నోములలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అక్కడ నుంచి వచ్చిన వారు కాల్వలో వెతికి శ్రీనివాస్ మృతదేహాన్ని నీటి నుంచి వెలికితీశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య నాగమణి ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ...

మఠంపల్లి, ఆగస్టు 15: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం బక్కమంతులగూడెంలో జరిగింది. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం చౌటపల్లి గ్రామానికి చెందిన ఐతగాని నాగార్జున(34) మైహోం పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 13న ఉదయం విధులకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదేరోజు సాయంత్రం ఇంటికి రాలేదు. స్నేహితుల, బంధువుల ఇంటికి వెళ్లి ఉంటాడని భావించిన కుటుంబసభ్యులకు గురువారం ఉదయం బక్కమంతులగూడెం గ్రామ శివారులో గాయాలతో చనిపోయి ఉండటాన్ని చిట్యాల వీరారెడ్డి చూసి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బైక్ పైనుంచి పడి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. నాగార్జున తండ్రి కొండలు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నాగార్జునకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో

గుర్తుతెలియని మృతదేహం

మేళ్లచెర్వు, ఆగస్టు 15 : పులిచింతల బ్యాక్ వాటర్‌లో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పులిచింతల ప్రాజెక్టు ఎగువ భాగాన పాత వెల్లటూరు సమీపంలో సుమారు 35,40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారన్నారు. వ్యక్తి చనిపోయి సుమారు రెండు, మూడు రోజులవుతుందని, అతడి ఒంటిపై మెరున్ కలర్ షర్ట్, నల్లప్యాంట్ ధరించారని, మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడికి మతిస్థిమితం సరిగా లేదని, కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాడని, మతిస్థిమితం సరిగా లేనందునే ప్రాజెక్టు వాటర్‌లో మునిగి చనిపోయినట్లుగా బావిస్తున్నామన్నారు. మృతదేహంపై ఎటువంటి గాయాలు లేవని ఆనవాళ్లు తెలిసిన వారు 8712686047 సెల్‌నెంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

భువనగిరి సమీపంలో రైలుపట్టాలపై

భువనగిరి టౌన్, ఆగస్టు 15: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి సమీపంలోని భువనగిరి- వగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలుపట్టాలపై గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు భువనగిరి రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ జే కృష్ణారావు తెలిపారు. గుర్తుతెలియని పురుషుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటాడని, లేత ఆకుపచ్చ టీషర్ట్, ఆకుపచ్చ నైట్ పాయింట్ బ్లాక్ షూ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు, మృతుని ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్లు 9848222169, 8712568454కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి టౌన్, ఆగస్టు 15 : ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి నాలుగు రోజుల అనంతరం మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ధోబీవాడకు చెందిన తాపీమేస్త్రీ రత్నపురం ముత్యాలు(52) ఈ నెల 11న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఆ రోజంతా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 12న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మండలంలోని పడిగిపల్లిలోని ఓ కల్వర్టులో ఓ మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని వెలికి తీశాక అప్పటికే నమోదైన మిస్సింగ్ కేసు ఫొటో ఆధారంగా మృతుడిని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్‌ల దొంగ అరెస్టు

సూర్యాపేట క్రైం, ఆగస్టు 15 : ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి బైక్‌లను దొంగిలించి వాటి విక్రయం ద్వారా వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తున్న దొంగను సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన పట్టణ ఎస్ఐ లింగయ్య సిబ్బందితో కలిసి ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. ఆ సమయంలో చౌటుప్పల్ పట్టణానికి మండల కిరణ్‌కుమార్ బైక్‌పై ఖమ్మం వెళ్తున్నాడు. పోలీసులు అతడిని ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా పారిపోయే ప్రయత్నించాడు. వెంటనే అతడిని పట్టుకొని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించడంతో కొంతకాలంగా సూర్యాపేట, ఖమ్మం, మిర్యాలగూడ, కోదాడ పట్టణాల్లో బైక్‌లను దొంగిలించినట్లు అంగీకరించాడు. అతడిపై కేసు నమోదు చేసి దొంగిలించిన బైక్‌లను స్వాధీన పర్చుకొని కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ లింగయ్య, సిబ్బంది గొర్ల కృష్ణయ్య, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, ఆనంద్, మధు, సునీల్ ఉన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, విద్యా, వ్యాపార, రాజకీయ పార్టీల కార్యాలయాలల్లో జాతీయ జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయి పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో పాటు పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


సూర్యాపేటలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న జిల్లా న్యాయాధికారి ఎస్.గోవర్ధన్‌రెడ్డి


హుజూర్‌నగర్‌లో జెండా ఎగురవేస్తున్న జిల్లా అదనపు జడ్జి శ్యాంశ్రీ


సూర్యాపేట పరేడ్ గ్రౌండ్‌లో సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులు


జిల్లా కేంద్రంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ


తిరుమలగిరిలో జాతీయజెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు


సూర్యాపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్‌రెడ్డి


తుంగతుర్తిలో జెండాను ఆవిష్కరిస్తున్న జడ్జి ఫర్హీన్ కౌసర్


బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా వందనంలో పాల్గొన్న లింగయ్యయాదవ్


నేరేడుచర్లలోజాతీయ జెండా ఎగురవేస్తున్న డీటీ మౌనిక


పెన్‌పహాడ్‌లో వివిధ వేషధారణలో విద్యార్థులు


జిల్లా గ్రంథాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి

ఉత్తమ అవార్డులు అందుకుంది వీరే..


కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న అదనపు ఎస్పీ(ఏఆర్) జనార్థన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ బీఎస్ లత


అదనపు ఎస్పీ ఎం. నాగేశ్వర్‌రావు | వేణుమాధవరావు, ఆర్డీవో సూర్యాపేట. | వి. శ్రీనివాసులు ఆర్డీవో, హుజూర్‌నగర్ | వీవీ అప్పారావు జడ్పీ సీఈవో | కె. లత జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి | డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు డీఎంహెచ్‌ఓ | సీహెచ్ పాల్‌రాజ్ ఎస్ఈ, విద్యుత్‌శాఖ | వై. శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ల్యాండ్ సర్వే అధికారి | శ్రీకాంత్‌భట్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ | బాపూజీ ఎల్‌డీఎం


రమేష్‌కుమార్ పీసీ ఇంటలిజెన్స్ | మల్లేషం డీఈఈ | ఇరిగి కోటేశ్వరి, చైర్మన్ ఇండియన్ రెడ్‌క్రాస్ | శ్రీనివాసరాజు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ | ఎం. సుదర్శన్‌రెడ్డి ఏవో కలెక్టరేట్ | ఆర్. లక్ష్మానాయక్ ఈఎస్ | వెంకటయ్య, ఈఈ పంచాయతీరాజ్ | రమేష్‌కుమార్ డీపీఆర్వో | వై. అరుణాకర్‌రెడ్డి ఈఈ, మిషన్‌భగీరథ | వెంకటరమణ జిల్లా సంక్షేమ అధికారి | ఎస్. పద్మ డీసీవో | వై. రేణుక మెప్మా పీడీ | ఎల్. కిషన్ సీపీవో

త్యాగధనుల పోరాట ఫలితమే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం

స్వాతంత్ర్య వేడుకల్లో వక్తలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: ఎందరో ప్రాణ త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని పలువురు వక్తలు అన్నారు. జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించగా, కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త మీలా మహదేవ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ పతాకావిష్కరణ చేయగా, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, కక్కిరేణి శ్రీనివాస్, అబ్దుల్ రహీం, భాస్కర్, పాల్గొన్నారు. ధర్మభిక్షం భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కోర్టు ఆవరణలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎస్. గోవర్ధన్‌రెడ్డి పతాకావిష్కరణ చేశారు. తెలంగాణ తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో నారబోయిన కిరణ్, జ్యూవెలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గునగంటి రాములు, సూర్యాపేట బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.


జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్

● మఠంపల్లి విద్యా వనరులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హరిసింగ్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంగా రాథోడ్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో శ్రీనివాసులు, పోలీస్ స్టేషన్‌లో రామాంజనేయులు, భోజ్యతండాలో వరినాటు వేస్తున్న కూలీలు జాతీయ జెండాను ఎగరవేసి తమ భక్తి చాటారు. నాగారం సర్కిల్ కార్యాలయంలో సిఐ రఘువీరరెడ్డి, జాతీయజెండాను ఎగురవేశారు. కోదాడ మండలం కాపుగల్లు పీఏసీఎస్‌లో అధ్యక్షుడు నంబూరి సూర్యం, చిలుకూరులోని ఆయా కార్యాలయాల్లో తహశీల్దార్ ధృవకుమార్, మండల ప్రత్యేకాధికారి రాంచందర్‌రావు, మునగాల విద్యుత్ కార్యాలయంలో ఏఈ వికాస్, నడిగూడెంలో తహసీల్దార్ సరిత, నూతన్‌కల్ మండలం మిర్యాల గ్రామంలో చెరువు గట్టుపై పంచాయతీ కార్యదర్శి ఏ.అనిల్ జాతీయ పతాకం ఆవిష్కరించారు.


మేళ్లచెర్వు ఎంపీడీవో కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న అధికారి పద్మ

● తిరుమలగిరి మునిసిపాలిటి కేంద్రంలో ఎమ్మెల్యే మందుల సామేలు, సూర్యాపేట ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో వేణుమాదవ్, రవాణాశాఖ కార్యాలయంలో ఆర్టీవో సురేష్‌రెడ్డి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గరిడేపల్లిలో విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో జిల్లా రెండవ అదనపు జడ్జి శ్యాంశ్రీ, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్ధార్ నాగేందర్, సిఐ చరమందరాజు, మాజీ ఎంపిపి గూడెపు శ్రీనివాస్, మాజీ జడ్‌పిటిసి కొప్పుల సైదిరెడ్డి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి,సాముల రాంరెడ్డి, సాముల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేళ్లచెర్వు మండల పరిధిలోని రేవూరు ప్రాథమిక పాఠశాలలో కొంకపాక వెంకటేశ్వరశర్మ జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన మధ్యాహ్న భోజన భవనాన్ని కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, ఏ. పుల్లయ్యలు ప్రారంభించారు. నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి మోహన్‌బాబు, మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ జెల్లంకొండ విజయలక్ష్మి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రవీందర్‌నాయక్, జాతీయ జెండా ఎగురవేశారు. నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ ఫొటో పెట్టలేదని ఆయా పార్టీల నాయకులు ధర్నా చేశారు.


తుంగతుర్తిలో జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు


అర్వపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జెండా వందనంలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్

● పెన్‌పహాడ్ మండలంలో మండల ప్రత్యేకాధికారి రాములు, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ధరావత్‌లాలు, ఎస్ఐ పెరక రవీందర్, ఏవో కృష్ణసందీప్, డాక్టర్ స్రవంతి, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారులు, జాతీయ జెండాలను ఎగురవేశారు. పాలకవీడు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, గ్రామ పంచాయతీ కార్యలయాల్లో, పోలీస్‌స్టేషన్‌లో, డెక్కన్ సిమెంట్స్ కార్మాగారంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● మద్దిరాల మండలంలోని పోలుమల్ల జడ్పీహైస్కూల్‌లో పూర్వ విద్యార్థి పొట్టబత్తుల వేణు నాయనమ్మ జ్ఞాపకార్థం ప్రథమ, ద్వితీయ విద్యార్థులు ప్రసన్నకు రూ.3016, కిశోర్‌కు రూ.2016అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటనారాయణగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మేళ్లచెర్వు మండలంలోని రేవూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి కొంకపాక వెంకటేశ్వరశర్మ జ్ఞాపకార్థం భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, ఏపుల్లయ్య ప్రారంభించారు. రామాపురంలోని ప్రియా సిమెంట్స్ పరిశ్రమలో నిర్వహించిన వేడుకల్లో జీఎం సీతారామిరెడ్డి, టీజీఎం వెంకటేశ్వరరావు, జీఏకె ప్రసాద్, ఎన్‌టీకే స్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

నేరేడుచర్ల, ఆగస్టు 15: పట్టణంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు దుర్గారావు, వీరయ్య, సురేష్, శ్రీను తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని ఎంపీ రఘువీర్‌రెడ్డికి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చినవెంకటరెడ్డి పాల్గొన్నారు.

జానకినగర్ గ్రామంలో ప్రబలిన విష జ్వరాలు

చిలుకూరు, ఆగస్టు 15: మండలంలోని జానకినగర్ గ్రామంలో 70 మంది డెంగీ, చికెన్ గున్యాతో బాధపడుతున్నారని మాజీ జడ్పీటీసీ బట్టు శివాజీ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో డ్రైనేజీలు శుభ్రంచేయకపోవడం, దోమల మందు సకాలంలో పిచికారీ చేయన దోమల ఉధృతి పెరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తా


తిరుమలగిరిలో ఎమ్మెల్యే సామేలును గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

తిరుమలగిరి, ఆగస్టు 15: తిరుమలగిరిలో నూతనంగా ఏర్పాటు చేసిన కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. తిరుమలగిరిలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ ఇంటర్ కళాశాల భవనాన్ని గురువారం స్థానిక జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎమ్మెల్యే మాట్లా డారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి తిరుమలగిరికి కళాశాల మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలోనే కళాశాలకు ఆధునాతన భవనం, అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాననని హామీ ఇచ్చారు. తిరుమలగిరి పీహెచ్‌సీని 30పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, మునిసిపాలిటీ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మించి అన్ని మునిసిపాలి టీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేశారు. జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు, వైస్‌చైర్మన్ కేశిడి సరళ, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, హెచ్ఎం దామెర శ్రీను, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్, జనార్దన్, వీరేష్, జుమ్మీలాల్, మూల అశోక్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, అంబేడ్కర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు మాటమీద నిలబడాలి


పంట రుణాలను మాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మాటమీద నిలబడాలని ఎమ్మెల్యే సామేలు అన్నారు. రైతుల పంట రుణాలను మాఫీ చేసిందుకు తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మందుల సామేలు క్షీరాభిషేకం చేశారు. ముందుగా పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. గడువులోగా పంట రుణాలను మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు.

అంగరంగ వైభవంగా బోనాల పండుగ

సూర్యాపేట రూరల్, తిరుమలగిరి, రూరల్, పెన్‌పహాడ్, నూతనకల్, హుజూర్‌నగర్, ఆగస్టు 15: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బోనాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట మండలంలోని కాసరబాద, తాళ్లఖమ్మంపహాడ్ గ్రామాల్లో, తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో, పెన్‌పహాడ్ మండలంలోని నాగులపాటి అన్నారం, అన్నారంబ్రిడ్జి గ్రామాల్లో, నూతనకల్ మండలంలోని మిర్యాల గ్రామంలో, హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో బోనాలు పండుగను వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలను గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కోతి గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి. సైదులు, వేణు. వీరాచారి, ఎగ్గడి రాంప్రసాద్ పాల్గొన్నారు.

మిర్యాలలో పోలీసు పహారాలో..

నూతన్‌కల్ మండలంలోని సమస్యాత్మక గ్రామం మిర్యాలలో పోలీసు పహారా మధ్య బోనాల పండుగను నిర్వహించారు. బందోబస్తులో తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ ఆధ్వ ర్యంలో నూతన్‌కల్, తుంగతుర్తి, మద్దిరాల ఎస్ఐలు మహేంద్రనాథ్, ఏడుకొండలు, మధు నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


తిరుమగిరి మండలం తొండ గ్రామంలో బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

పాఠశాలకు దాతల సహకారం అభినందనీయం


విద్యార్థులకు టైలు, బెల్ట్‌లు, షూ అందజేస్తున్న దాతలు

నాగారం, ఆగస్టు 15: ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమని మండలంలోని పసునురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం బి.విష్ణుమూర్తి అన్నారు. ఆ పాఠశాల విద్యార్థులకు బుధవారం అదే గ్రామానికి చెందిన దాతలు దేవకమ్మ, రాఘవులు రూ.25 వేల విలువైన టైలు, బెల్టు, షూస్ అందజేశారు. ఎల్ఐసీ ఏజెంట్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ రూ.9వేల విలువైన బీరువా, అభిమల్ల శ్రీరామ్ రూ.5వేల విలువైన మైక్‌సెట్, చిత్తలూరి యాదగిరి రూ.14వేల విలువైన బీరువా, పాఠశాల అభివృద్ధికి మామిడి అరవింద్ రూ.5వేలు, తోడుసు లింగయ్య రూ.వేయి, మంజుల రూ.500లు హెచ్‌ఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హరికిషన్, ఉపాధ్యాయులు సైదులు, శివకుమార్, కె.విజయలక్ష్మి, రాజు, శోభారాణి, కల్యాణి పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు చేయూత

నడిగూడెం, ఆగస్టు 15: మండలంలోని కాగితరామచంద్రపురం ఉన్నత పాఠశాలకు రూ.50వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు ఎ.హనుమరెడ్డి గురువారం విరాళంగా అందజేశారు. ఇదే గ్రామానికి కొల్లు రామతులసి రూ.20వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జి.రాజేష్, ఎస్ఎంసీ చైర్మన్ గోపమ్మ, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, వెంకటరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

● మండలంలోని కేశవపురం పాఠశాల విద్యార్థులకు పోలీస్ శాఖలో పని చేస్తున్న అదే గ్రామానికి చెందిన దేవేందర్, శంకర్, వినయ్‌కుమార్, మహేష్‌లు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా యాకూబ్‌పాషా

హుజూర్‌నగర్, ఆగస్టు 15: హుజూర్‌నగర్ మునిసిపల్ కమిషనర్‌గా యాకూబ్‌పాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హుజూర్ నగర్‌లో మేనేజర్‌గా పనిచేసిన యాకూబ్‌పాషా నేరేడుచర్లకు బదిలీ అయ్యారు. అక్కడ నుంచి హుజూర్‌నగర్ మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పాషాను వైస్ చైర్మన్ సంపత్, సభ్యులు సన్మానించారు.